


7

## గత సంచికనుంచి కొనసాగింపు

**జరిగిన జగన్నాటకం**

**అందరూ ఎడమచేతిని వాడే సవ్యలంకలో కుడి చేతిని వాడినందుకు బోసుకు మరణదండన విధించబోయారు. ఆచార్య వేదాంతం, ద్వీప, పశుపాల కలిసి బోసుని కాపాడారు. అతనే మహాబసు అయ్యుంటాడాని ద్వీప, వేదాంతం అనుకుంటారు. సముద్రంలో మునిగిపోబోతున్న బోసుని జలపతి కాపాడాడు. అతని ఓడలో అన్నిరకాల జంతువులు జంటలుగా వున్నాయి.**

"అయితే మనిద్దరం జంట అని అనుకోవాలా?" అడిగాడు బోసు. ద్వీప పెద్దగా స్పందించలేదు. ఒక చూపు అతని వైపు అలవోకగా విసిరి మళ్ళీ ఎదురుగా జరుగుతున్న సూర్యోదయాన్ని చూస్తూ వుండిపోయింది. సముద్రపు ఒడ్డున సవ్యంలంక భూభాగం పైన ఓడ లంగరు వేసుంది. ఆ ఓడపైన నిలబడి తూరుపు వైపు ఉదయిస్తున్న సూర్యుణ్ణి చూస్తున్నారు ఇద్దరూ.

"ఏమిటి మాట్లాడవు? మనిద్దరం జంట అనే కదా దీని అర్థం?" అడిగాడతను మళ్ళీ.

"నీకెందుకలా అనిపించింది?" అందామె తల తిప్పకుండా.

"నువ్వు రాకముందు జలపతి ఏం చెప్పాడో తెలుసా? ఈ ప్రపంచం మునిగిపోతోందట. అందుకే అన్ని ప్రాణుల్ని జంటలు జంటలుగా పడవ ఎక్కించుకోని వాటిని కాపాడుతున్నాడట. అలా కాపాడబడిన జంతువుల వల్లే ప్రళయం తరువాత కూడా జీవరాశి మనుగడ కొనసాగుతుందట."

"అవును. ఆ విషయం నాకు కూడా తెలుసు" అన్నదామె.

"కానీ నువ్వు గమనించావా? మనుష్యులలో మనిద్దరమే వున్నాము" అతను ఆపగానే ద్వీప అతని వైపు చూసింది. నిజానికి జలపతి చెప్పిన కారణం పైన అతని ధ్యాస లేదు. తామిద్దరం జంట అన్న ఊహే అతనికి ఆనందాన్ని ఇస్తోంది. ఇది అర్థం చేసుకున్న ద్వీప, అతనితో అలాగే ఆట కొనసాగించాలనుకుంది.

"ప్రళయం రాలేదుగా మరి" అంది.

"ప్రశ్న ప్రళయం గురించి కాదు. జంటగా మనిద్దరినే ఎందుకు ఎంచుకున్నాడని?" అడిగాడు మళ్ళీ.

"మనిద్దరినే అని ఎందుకనుకుంటున్నావు. ఓడలో నేను ఒక్కదానినే ఆడదాన్ని, కానీ మగవాళ్ళు ముగ్గురున్నారుగా" అంది జలపతి, పశుపాలని గుర్తుచేస్తూ. బోసు మనసు ఉసూరంది. అయినా అతను వదల్లేదు.

"అలాగే అనుకుందాం. మరి నన్ను ఎందుకు కాపాడినట్లు?" అడిగాడు.

"అయితే పశుపాలని కూడా కాపాడాడు" అంది ఆమె రెట్టిస్తున్నట్లు. బోసుకి కాస్త చికాకుగా అనిపించింది.

"అసలు నువ్వెందుకు వచ్చావు? ఎలా వచ్చావు?" అన్నాడు. ద్వీప అతని వైపు తిరిగింది. ఆమె ముఖంలో చిలిపితనం పోయింది. ఆమె గొంతు గంభీరంగా మారింది.

"నీకు భవిష్యజ్ఞానం గురించి తెలుసా?" అంది.

"అంటే?"

"జరగబోయే విషయాన్ని ముందే ఊహించడం. అలా చేయగలిగినవాళ్ళు మహాజ్ఞానులై వుంటారు. ఎన్నో వందల సంవత్సరాల నుంచి ఎందరో మహాజ్ఞానులు భవిష్యత్తుని దర్శించి, జరగబోతున్న విషయాలను ఒకచోట రాసి వుంచారు. దానినే మహాగ్రంధమని అంటాము. అయితే అందులో వున్న విషయాలు అత్యంత గోప్యంగా వుంటాయి. అంత సులభంగా ఎవరికీ అర్థం కాని విధంగా రాసివుంటాయి. వాటిని విశ్లేషించి, అందులోని రహస్యాలను ఛేదించగలిగిన వాళ్ళు ఇద్దరే వున్నారు. ఒకళ్ళు జలపతి, మరొకరు ఆచార్య వేదాంతం." అంది.

సరసంగా సాగుతున్న సంభాషణ ఉన్నట్టుండి గంభీరంగా మారిపోవటం బోసుకు నచ్చలేదు.

"నేను అడిగిందేమిటి?నువ్వు చెప్తున్నదేమిటి?" అన్నాడు.

"ఇంకా అర్థం కాలేదా? నిన్ను కాపాడి ఈ పడవలోకి లాక్కున్నది జలపతి, నన్ను ఇక్కడికి వెళ్ళమని పంపించింది ఆచార్య వేదాంతం. భవిష్యత్తు గురించి తెలిసిన ఈ ఇద్దరూ మనిద్దరినే కలపాలని ఎందుకనుకున్నారు?" అన్నదామె.

"నువ్వు కూడా ఏమిటి ద్వీపా?" అన్నాడు బోసు నిట్టూరుస్తూ. ద్వీప కోపంగా అతని వైపు చూసింది.

"నీకు ఇంకా అర్థంకావటంలేదా?" అంది

"నాకు ఏమీ అర్థం కావటం లేదు. ఒక్కటి తప్ప. ఇక్కడున్నవాళ్ళంతా పిచ్చివాళ్ళు. అంతే!" అని అక్కడ్నుంచి కదలబోయాడు.

"ఆగు మహాబసు!" అరిచింది ద్వీప. అతను ఆగి ఆ కొత్త పిలుపుకి ఆశ్చర్యంగా చూశాడు. ఆమె కొనసాగించింది. "అలా పిలిచానని ఆశ్చర్యపోకు. మహాగ్రంథం ప్రకారం నీ పేరు మహాబసు. నువ్వు వస్తావని ముందే ఊహించి రాశారు భవిష్యత్తు చూసినవాళ్ళు. ఇంకా ఏముందో తెలుసా? నువ్వు వచ్చేనాటికి ఈ భూమి మీద అన్ని వైపులా అరాచకం తాండవిస్తుంటుంది. నువ్వు పోరాటం చేస్తావు. ఈ రాజ్యాధికార మత్తులను తుదముట్టిస్తావు. నీ ద్వారా ఇక్కడ ప్రజాపాలన ఏర్పాటు అవుతుంది. నీతో నడవని వాళ్ళను మహాప్రళయం మింగేస్తుంది." అంటూ మహాగ్రంథంలో వున్న విషయాలని వివరించింది.

"కథ బాగుంది. అరాచకం వున్న మాట కూడా నిజమే. జలప్రళయం వచ్చిన మాట కూడా నిజం. ఈ రెండింటి మధ్యలో నేను పోరాడాలి కదా. అవన్నీ వదిలిపెట్టు. నేను కాస్త కుదుటపడగానే ఇక్కడ్నించి వెళ్ళిపోతాను. అప్పుడైనా మీరు చెప్పుకునే కథ కట్టు కథ అని గుర్తించండి." అన్నాడు బోసు విసురుగా.

"వేదాంతం లాంటి జ్ఞానులు చెప్పింది అబద్ధం కాదు. నువ్వు ఈ ద్వీపం వదిలి వెళ్ళవు, వెళ్ళలేవు"

"మీరంతా కలిసి ఆపుతారా?"

"నీ అంతట నువ్వే ఆగుతావు"

"ఏమిటంత నమ్మకం"

"నువ్వు రాకముందే మహాబసు నా ప్రియుడౌతాడని ఆచార్య వేదాంతంగారన్నారు."

ఉన్నట్టుండి విషయం మరోవైపుకి తిరిగిందని బోసుకు అర్థం కాలేదు. యధాలాపంగా "అది నువ్వు నమ్ముతున్నావా?" అన్నాడు.

"నేను నమ్ముతున్నాను. ఏం?నువ్వు నమ్మట్లేదా?" అంటూ అక్కడ్నుంచి చరచరా వెళ్ళిపోయింది.

తాను చేసిన తప్పు అర్థమయ్యి, అలాగే నిల్చుండిపోయాడు బోసు. అతని ఎదురుగా అప్పుడే ఉదయించిన సూర్యుడు ఎర్రదనాన్ని వదిలించుకోని తెల్లగా మారుతున్నాడు.

★★★

ఆ రోజు సాయంత్రం దాకా జలపతి జాడలేదు. అతను కనపడితే ఎలాగైనా సముద్రాన్ని దాటించమని అడగాలని బోస్ అనుకున్నాడు. ఓడ దిగితే మళ్ళీ ఏ విపత్తుని ఎదురుకోవాల్సి వస్తుందో అని భయంగానే వున్నా, ఏం చెయ్యాలో తోచక ఓడ దిగి మెత్తటి ఇసుక మేటల మీద నడుస్తూ ముందుకు వెళ్ళాడు బోసు. కనుచూపు మేరలో దట్టంగా పరుచుకున్న అడవి అతన్ని ఆకర్షించింది. ఆకాశానికి ఊర్ధ్వ మార్గం వేస్తున్నట్లు పచ్చటి చెట్లు నిలబడి వున్నాయి. అప్రయత్నంగా అతని అడుగులు అటు వైపు పడ్డాయి. ఓడలో నుంచి అతన్నే గమనిస్తున్న ద్వీప అదేమి పట్టనట్లు లోపలికి వెళ్ళిపోయింది.

బోసు మనసంతా గజిబిజిగా వుంది. అప్పటికి ఆ దీవిలో అడుగుపెట్టి పదిహేను రోజులైంది. ఒక్కోసారి ఒక్కో అనుభవం. మరణం అంచులదాకా వెళ్ళి వచ్చిన సందర్భాలు. ప్రాణలను పణంగా పెట్టి మరీ కాపాడిన వాళ్ళు. కొందరు మరణాన్ని కోరుకుంటే మరికొందరు తనని ఒక ఆశాకిరణంలా చూస్తున్నారు. ఇంత గందరగోళం మధ్య గాంధీ, బోస్ వచ్చి మాట్లాడుతున్నారు.

బోస్ ఆలోచిస్తూనే గబగబా నడుస్తున్నాడు. దట్టంగా వున్న అడవిలోకి వచ్చేసిన సంగతి కూడా అతను గుర్తించలేదు. కళ్ళముందు ఒకరి తరువాత ఒకరుగా అందరూ కనిపిస్తున్నారు. వేదాంతం, దళాధిపతి, పశుపాల, నందు, జలపతి, ద్వీప... ద్వీ... ప...!! అక్కడే ఆగిపోయింది మనసు.

"మహాబసు నా ప్రియుడౌతాడని ఆచార్య వేదాంతంగారన్నారు." ఆమె అన్న మాటలు పదే పదే వినపడుతున్నాయి. మొదట మహాబసు అన్న పేరుని మళ్ళీ తలుచుకోని నవ్వుకున్నాడు. తరువాత ద్వీపతో జరిగిన సంభాషణ గుర్తుకొచ్చింది. "నేను నమ్ముతున్నాను. ఏం నువ్వు నమ్మట్లేదా?" అన్నమాట గుర్తుకురాగానే నడక ఆగిపోయింది.

ద్వీప తనని మహాబసు అనుకుంటోంది. ఆమె మహాబసుని ప్రేమించబోతోందని ఆమెకు ముందే వేదాంతం చెప్పాడు. అంటే ఇప్పుడు ద్వీప తనని ప్రేమిస్తోందా?

"నేను నమ్ముతున్నాను. నువ్వు నమ్మట్లేదా?" ద్వీప అడిగిన ఆ ప్రశ్న మళ్ళీ తల్చుకున్నాడు. "నేను ప్రేమిస్తున్నాను. నువ్వు ప్రేమించట్లేదా?" అన్నట్లే అనిపించింది. ఒక్కసారి ఏదో మెరుపు మెరిసినట్లు అనిపించింది. వెంటనే ద్వీపని చూడాలనిపించింది. అనిర్వచనీయమైన ఒక మధుర భావన ఏదో అతనిని కమ్మేసింది. వెనక్కి తిరిగాడు.

గాలిలో సన్నటి ఊళ శబ్దం చేస్తూ అతని ఎడమ భుజాన్ని తాకుతూ ఏదో దూసుకెళ్ళింది. బోసు తేరుకోని అది వెళ్ళిన దిశగా చూశాడు. అటుగా వున్న ఒక చెట్టు కాండంలో దిగబడివుందొక బాణం!

అప్పటికే అతను అడవిలో చాలా లోపలికి వెళ్ళిపోయిన విషయం అర్థం అయ్యింది. మరో రెండు బాణాలు కుడి వైపు నుంచి దూసుకెళ్ళాయి. క్షణంలో జరుగుతున్నదేమిటో అర్థం అయ్యింది. దళాధిపతి వచ్చేశాడు..! తనని వేదాడటానికి...!!

బోసు పరుగెత్తాడు.

ఆ చెట్ల మధ్య ఎటు వెళ్తున్నాడో తెలియటం లేదు కానీ పరుగెత్తాడు. బాణాలు దూసుకు వచ్చిన వైపుకి వ్యతిరేక దిశలో వీలైనంత వేగంగా కదిలాడు. కానీ ఎంతోసేపు కాదు. కొంత దూరం పరుగెత్తాక ఒక్కసారిగా ఎవరో ఆపినట్లు ఆగిపోయాడు. పక్కనే వున్న చెట్టు చాటున దాక్కున్నాడు.

"మహాబసు" అంటూ పిలిచిన ద్వీప పిలుపు జ్ఞాపకం వచ్చింది. మళ్ళీ ద్వీపని చూడాలనిపించింది.

తాను దాక్కున్న చెట్టు పక్కనుంచి తొంగి వెనక్కి చూశాడు. అతని అంచనా నిజమే. వచ్చింది దళాధిపతి, అతని సైనికులే. వాళ్ళు వస్తున్నంత మేర అణువణువు వెతుకుతూ వస్తున్నారు. సాయంసంధ్య దాటి అప్పుడప్పుడే చీకట్లు ముసురుతున్నాయి. ఆ కాస్త మసక చీకటిలో ఎక్కడ శతృవు కనపడకుండాపోతాడో అని కనపడ్డ ప్రతి చెట్టు గుబురులోకి తమ కత్తుల్ని బలంగా దించుతున్నారు.

బోసు కళ్ళ ముందు ద్వీప మళ్ళీ కనిపించింది.

"నువ్వు పోరాటం చేస్తావు. ఈ రాజ్యాధికార మత్తులను తుదముట్టిస్తావు." మహాగ్రంధంలో విషయాలను ద్వీప చెప్పడం గుర్తుకువచ్చింది.

"పోరాడు" అంటూ ఉపదేశిస్తున్న గాంధీ, బోస్ గొంతులు వినిపిస్తున్నాయి.

మొదటిసారి అతనికి వెంటాడుతున్న మృత్యువుతో పోరాడాలనిపించింది.

తాను దాక్కొన్న చెట్టు పైకి ఎక్కాడు. అక్కడ్నుంచి దళపతి సైన్యం ఎంత వుందో అంచనా వేశాడు. సుమారు ఇరవైమంది వున్నారు. అదృష్టవశాత్తు ఏ ఇద్దరూ కలిసిలేరు. ఎవరికి వారు వెతుకుతున్నారు. తాను వున్న చెట్టు కిందకి మనిషి వచ్చేదాకా చప్పుడు చెయ్యకుండా వుండిపోయాడు. సరిగ్గా ఒక సైనికుడు చెట్టు కిందకు రాగానే చెట్టు మీద నుంచి అతని వెనక వైపుకు దూకాడు.

దూకుతున్నప్పుడే బోసు కుడి చేతిని సైనికుడి మెడ చుట్టు బిగించాడు. కుడి మోకాలుని పైకెత్తి అతని నడుం మీద వుంచాడు. జరిగింది సైనికుడు గ్రహించేలోగా అతన్ని వెనక్కి విరిచాడు. సైనికుడి నోట్లో నుంచి ఏ చప్పుడూ రాలేదు. నిశబ్దంగా నేలకొరిగాడు.

అతని చేతిలో కత్తిని తీసుకున్నాడు బోసు. చక చకా కత్తిని తిప్పాడు. ఎంతో అలవాటు వున్నట్లు లాఘవంగా చేయి కదలటం అతనికే ఆశ్చర్యంగా అనిపించింది. చీకట్లు పూర్తిగా ఆక్రమించేలోగా ఆ అడవిలోంచి బయటపడాలి అనుకున్నాడు. తరువాత వచ్చే సైనికుడి కోసం, కత్తిని పిడిని రెండు చేతులతో బలంగా పట్టుకోని ఎదురుచూస్తున్నాడు.

★★★

ద్వీప పదే పదే ఓడ అంచు దగ్గరకు వచ్చి చూస్తోంది. బోసు ఇంకా రాకపోవడంతో అంతకంతకీ ఆమెలో ఆందోళన అధికమౌతోంది. అనవసరంగా అతనితో వాదనకి దిగానా అని పదే పదే అనుకుంటోంది. కొంతసేపటికి పశుపాల అక్కడికి చేరుకున్నాడు.

“ఏమైంది ద్వీపా? ఏదో ఆందోళనపడుతున్నావు” అన్నాడు.

“మహాబసు అడవి వైపు వెళ్ళాడు” అన్నది ఆమె కాస్త తడబాటుగా. క్షణకాలం ఆశ్చర్యంతో నిలబడిపోయాడు పశుపాల.

“ఆయన్ను ఒక్కణ్ణే ఎందుకు వెళ్ళనిచ్చారు?” అన్నాడు.

“నేనేమన్నా వెళ్ళమన్నానా? ఆయనంతట ఆయనే వెళ్ళాడు.” అంది.

ఇద్దరూ కొద్దిసేపు మౌనంగా వున్నారు. వెనుక సముద్రపు హోరు, ఎదురుగా కొంత దూరంలో కనిపిస్తున్న అడవిలోంచి వస్తున్న గాలి శబ్దాలు తప్ప ఇంకే చప్పుడూ లేదక్కడ.

“ఆయనే మహాబసు అని ఒప్పుకున్నారా?” అడిగాడు పశుపాల నిశబ్దాన్ని ఛేదిస్తూ.

“ఒప్పుకోలేదు. ఇక్కడ్నుంచి వెళ్ళిపోవాలనే అంటున్నాడు.”

“మరి ఎలా?”

“ఏమో మరి”

మళ్ళీ కొంతసేపు నిశబ్దం.

“మొదటిసారి ఆయన్ని కలిసినప్పుడు, ఆయనే మహాబసు అని తెలియక చాలా దురుసుగా ప్రవర్తించాను. నా ఇంటికే నడిచివచ్చాడా దేవుడు. ఆయన గొప్పదనం నాకు అప్పుడు తెలియక ఇంట్లో నుంచి వెళ్ళగొట్టాను.” అన్నాడతను. అతని గొంతులో పశ్చాత్తాపం స్పష్టంగా వినపడుతొంది. ద్వీప తలాడించింది కానీ ఏమీ మాట్లాడలేదు. ఆమె ఆలోచనంతా బోసు చుట్టే తిరుగుతోంది.

సరిగ్గా అదే సమయానికి అక్కడికి వచ్చాడు జలపతి.

“మహాబసు ఎక్కడ?” వస్తూనే అడిగాడు ఆయన కూడా. అడవి వైపు చేతిని చూపింది ద్వీప. జలపతి ముఖంలో ఆందోళన చూసి ద్వీప ఆశ్చర్యపోయింది.

“ఏమైంది?” అంది.

“మహాబసుకి నాలుగు గండాలు వున్నాయి. ఈ గండాల నుంచి బయటపడితే తప్ప ఆయన నాయకుడు కాలేడు. ఆయన్ను వంటరిగా వెళ్ళనివ్వడం ఎంత ప్రమాదమో తెలుసా?” అంటూనే వెనక్కి గబగబా అడుగులేసుకుంటూ తన గదిలోకి వెళ్ళాడు. మరో నిముషంలో ఒక చేతిలో విల్లంబు, మరో చేతిలో బాణాలతో బయటకు వచ్చాడు. విషయం అర్థం చేసుకున్న పశుపాల, ద్వీప కూడా అందుబాటులో వున్న ఖడ్గాలను అందుకున్నారు. అందరూ పరుగులుపెడుతూ ఓడ దిగి నేల మీదకు వచ్చారు. దూరంగా అడవి దగ్గర పైకి రేగుతున్న దుమ్మును చూసి ఆశ్చర్యంతో ఆగిపోయారు.

అక్కడ –

బోసు మధ్యలో నిలబడి వున్నాడు. అతని చేతిలో కత్తి తళతళా మెరుస్తోంది. అతని చుట్టూ చిన్న చిన్న గాయాలతో పదిమంది సైనికులు అలసటతో రొప్పుతున్నారు. వారిలో ఏ ఒక్కరు అడుగు ముందుకు వేసినా మెరుపులా అటువైపు కత్తి కదుపుతున్నాడు బోసు.

ఓడదగ్గర నిలబడి చూస్తున్న ముగ్గురి ముఖాలలో ఆందోళన స్థానంలో ఆనందం వచ్చి చేరింది. బోసు, మహాబసుగా మారటం వాళ్ళ కళ్ళముందు జరుగుతోంది. అందుకే ఆ ఆనందం. అయితే బోసు పక్కనే పొంచి వున్న ప్రమాదాన్ని వాళ్ళు గుర్తించలేకపోయారు. ఆ ప్రమాదం పేరు దళాధిపతి.

★★★

**(జరగబోయే జగన్నాటకం వచ్చే మాసం)**

COMMENTS